లంక... చూడరు ఇటు వంక



కమినిలంకలో కోతకు గురవుతున్న కొబ్బరి తోటలు (ఫైల్)



వరదల సమయంలో ముంపుబారిన పడిన మత్స్యకార కాలనీ (ఫైల్)

- అభివృద్ధికి ఆమడదూరం
- ఏటా వెంటాడుతున్న వరద ముంపు
- కోతకు గురవుతున్న భూములు

ముమ్మిడివరం: వరదలు వచ్చాయంటే.. బిక్కుబిక్కు మంటూ జీవనం సాగించాల్సిందే. ఆ గ్రామాల వంక చూసి పట్టించుకునేవారు లేక వారి అవస్థలు వర్ణనాతీతం. ముమ్మిడివరం మండలంలో లంక గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండటంతో ఇక్కడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఈ గ్రామాల పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. లంకాఫ్ ఠానేల్లంక పంచాయతీ పరిధిలో కూనాలంక, మత్స్యకార కాలనీ, కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంక, శేరుల్లంక, సలాదివారి పాలెం గ్రామాలు గోదావరి చెంతనే జీవిస్తున్నారు. వరదల సమయంలో ఈ గ్రామాల ప్రజలు అపార నష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రాణాలు అరచేత పట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తుంటారు. ఈ పంచాయతీల ఆదాయం కేవలం రూ.లక్షల్లోనే ఉంటుంది. దీంతో ఏవిధమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీల్లేకుండా పోయింది. 2,400 మంది జనాభా, 1,572 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామాల్లో అత్యధిక శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే. ఇప్పటి వరకూ పంచవర్ష ప్రణాళిక నిధులతో తాగునీరు, పారిశుధ్య పనులు మాత్రమే చేపడుతున్నారు. ఈ గ్రామాల్లో రహదారులు అంతంత మాత్రమే. లంక గ్రామాలు కావడంతో ముళ్లపొదలు పెరిగి పాముల భయం వెంటాడుతోంది. మంచినీటి సరఫరా సక్రమంగా లేక కలుషిత నీరే వీరికి శరణ్యమవుతోంది. ముమ్మిడివరం పోలమ్మ చెరువు ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా ఈ ప్రాంతానికి తాగునీరందిస్తున్నారు. తరచూ పైపులైన్లు లీకై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని వరద ముప్పు

గోదావరి చెంతనే ఈ గ్రామాలు ఉండటంతో వర్షాకాలం వరదల ముంపు ముప్పు తప్పడం లేదు. కొద్దిపాటి వరదలకే గ్రామాలను నీరు ముంచెత్తుతోంది. రహదారులు నీటమునిగి బాహ్య ప్రపంచంతో వీరికి బంధాలు తెగిపోతున్నాయి. నివాస గృహాలు ముంపు బారిన పడుతున్నాయి. వరద నీటిలోనే బిక్కుబిక్కుమంటూ ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. లంక గ్రామాల్లో పండించే కూరగాయలు, వాణిజ్య పంటలు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారు. వరదల సమయంలో తలదాచుకొనేందుకు వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన తుపాన్ షెల్టర్ సైతం ముంపు బారిన పడుతుండటంతో బాధితులు పడరాని పాట్లు పడుతున్నారు. అయినా పాలకులు దీనిపై దృష్టిసారించడం లేదు.

నదీ గర్భంలోకి భూములు

వరదలకు ఈ ప్రాంతంలో విలువైన పంట భూములు కోతకు గురవుతున్నాయి. అక్కడి చెట్లు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు పండించుకుని జీవనోపాధి పొందుతున్నారు. వరద నీటి ప్రవాహానికి లంక భూములు కరిగిపోతున్నాయి. దీంతో వ్యవసాయ భూమి లేక వారికి గుండెకోత మిగులుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి లంక భూముల రక్షణకు, గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

శారదాదేవి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శారదాదేవి అమ్మవారు

యానాం: స్థానిక గోపాల్‌నగర్‌లో కొలువైన శారదాదేవి అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పినపోతు భైరవస్వామి దంపతుల సౌజన్యంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విశేష పూజల్లో యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లక్ష్మీహోమం, సరస్వతి, చండీ హోమాలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలను అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు పొన్నాడ వెంకటేశ్వరరావు, వేగేశ్న గోపాలరాజు, అల్లూరి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి



ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: స్థానిక నల్లచెరువు ప్రాంతం నుంచి గోపాల్‌నగర్ మీదుగా 55 ఎకరాల చెరువు వద్ద 5 ఎమ్ఎల్‌టీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఈ పనుల గురించి స్థానిక పీడబ్ల్యూడీ అధికారులతో ఆయన చర్చించారు. ఇప్పటికే నల్లచెరువు నుంచి ద్రాక్షారామ- యానాం రహదారిలో సిమెంట్ రహదారిని సైతం బద్దలుకొట్టి భారీ తాగునీటి గొట్టాలను అమర్చారన్నారు. దీనికితోడు త్వరగా సిమెంట్ రహదారికి తక్షణం కాంక్రీట్‌తో పూడ్చి వేయాలని ఆయన ఆదేశించారు.

నూతన భవనానికి నిధులు

స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ బాలికల హైస్కూల్ భవనం శిథిల దశకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన భవనానికి నిధులు కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం రెండు బ్లాకుల నిర్మాణం జరుగుతుందని, మరో రెండు కొత్తవి నిర్మించాల్సి ఉందన్నారు. తరగతి గదులు సరిపోనందున కనీసం మరో 6 గదులు ఉండాల్సి ఉందన్నారు. స్మార్ట్ తరగతి గదులకన్నా ముందు విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు నిర్మించాలన్నారు. పీడబ్ల్యూడీ ఇంజినీర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



ఎస్.యానం కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసును సత్కరిస్తున్న జెడ్పీటీసీ సంపదరావు, నాయకులు

ఉప్పలగుప్తం: కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేసి, రానున్న రోజుల్లో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు కార్యకర్తలకు సూచించారు. శనివారం ఎస్.యానం గ్రామంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీ ముఖ్య భూమిక పోషించాలన్నారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాలతో ఎస్.యానం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లంకే శ్రీనివాసును నియమించామన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు జెడ్పీటీసీ సంపదరావును, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీనును పూలమాలలతో సత్కరించారు. నాయకులు పొగాకు శ్రీను, కోట సత్తిబాబు, తాడి గోపాలకృష్ణ, లంకే చిరంజీవి, వలచోళ్ల కోటి, రేవు రాజేష్, ముత్తాబత్తుల సురేష్, జోన్నాడ మహాలక్ష్మి, వలచోళ్ల ప్రకాష్, అంబటి శ్రీను, కర్రి రామకృష్ణ, అయితాబత్తుల పల్లయ్య, ముదే దుర్గబాబు, పాతాడి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



బాలయోగి స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, తదితరులు

అమలాపురం రూరల్: యోగ సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక బాలయోగి స్టేడియంలో ఉద్యోగులకు మాస్టర్ ట్రైనీ ద్వారా యోగా నేర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజూ యోగా సాధన చేసి శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలన్నారు. భారతీయ వారసత్వ సంపద యోగాసనాలను నేడు ప్రపంచమంతా అనుసరించడం మన దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. ఆరోగ్యకర జీవనాన్ని సొంతం చేసుకునేందుకు యోగా ఓ సాధనమన్నారు. డీఆర్వో రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారి కె.విజయ్‌కుమారి, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

కిమ్స్ డెంటల్ కళాశాలలో..

స్థానిక కిమ్స్ డెంటల్ కళాశాలలో యోగాంధ్ర వేడుకలు నిర్వహించారు. అధ్యాపకుడు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగాతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. కిమ్స్ డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, కళాశాల అధ్యాకులు పాల్గొన్నారు.

రక్తమిచ్చి.. అభయమిచ్చి

రక్తమిచ్చిన దాతలకు సత్కారం

అమలాపురం టౌన్: ఓ దాత 61 సార్లు.. మరో దాత 40 సార్లు.. మరో ఇద్దరు దాతలు 25 సార్లు, అంతేకుండా 16 సార్లు రక్తదానం చేసిన ప్రాణదాతలు.. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక యెండూరి ఫంక్షన్ హాలులో అధిక సార్లు రక్తమిచ్చిన నలుగురి దాతలను అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గోటేటి గంగాధర్ ఇప్పటి వరకూ 61 సార్లు రక్తదానం చేశారు. మరో వాకర్, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వలవల శివరావు 40వ సారి, వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వైఎస్ఎన్ మూర్తి 25వ సారి, వాకర్ నమ్మిన వీరబాబు 16వ సారి రక్తదానం చేశారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో వీరు రక్తదానం చేశారు. వాకర్స్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్ కూడా రక్తమిచ్చారు. ఆ నలుగురు వాకర్స్ ప్రతినిధులను వాకర్స్ క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, చింతలపూడి సత్తిబాబు, కుడుపూడి త్రినాథ్, పచ్చిగోళ్ల రాజా, నూకల సత్యనారాయణ తదితరులు రక్తదాతలను అభినందించారు.



రక్తదాతలను అభినందిస్తున్న వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు

యోగా శిక్షకుల రక్తదానం

అమలాపురం టౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అమలాపురంలోని శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న 47 మంది యువతీ యువకులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో శనివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆ యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరు ముందుకు వచ్చారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితోపాటు కాకినాడ, రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 23 మంది యోగాశ్రమ శిక్షకులు రక్తదానం చేశారు. ఇందులో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో యోగా శిక్షణ పొందుతున్న 12 మంది మహిళలు రక్తదానంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 23, కోనసీమలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు 24 మంది యోగా అభ్యాసకులు రక్తమిచ్చారు. తమ యోగాశ్రమం ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా దాదాపు 28 వేల మంది రోగులకు రక్తదానం చేశామని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి కుటుంబీకులు, బంధువులు ఫోన్ చేస్తే చాలు రక్తదానం చేసేందుకు యోగాశ్రమ శిక్షకులు సిద్ధంగా ఉంటారని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న మహిళలు

వీరేశ్వరస్వామి దేవస్థానం ఏసీగా సత్యనారాయణ



వీరేశ్వరస్వామి దేవస్థానంలో బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం ఏసీగా వి.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఈఓగా ఉన్న మాదిరాజు లక్ష్మీనారాయణ కాకినాడ సర్పవరంలో ఉన్న భావన్నారాయణ స్వామి ఆలయానికి వెళ్లిపోయారు. సత్యనారాయణకు తొలుత అర్చకులు, వేద పండితులు, పురోహితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఆలయ అభివృద్ధికి సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన సూచించారు.

బూత్ కమిటీల అధ్యక్షుడికి సత్కారం



ఉప్పలగుప్తంలో కిషోర్‌ను అభినందిస్తున్న ఎంపీపీ జానకీ రాంబాబు దంపతులు, నాయకులు

ఉప్పలగుప్తం: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చీకట్ల కిషోర్‌ను ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకీ, పార్టీ నాయకులు ఆయన నివాసంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి, పూలమాలలతో అభినందించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా జిల్లాలో బూత్ కమిటీల పటిష్టం చేయాలని వారు కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, నాయకులు నల్లా నాయుడు, చప్పిడి దుర్గారావు, జొన్నాడ చిన్నీ, నల్లా సూర్యప్రకాష్, దోనిపాటి వెంకటేశ్వరరావు, నల్లా శ్రీనువాసరావు, నల్లా ఆదినారాయణ, కోడి పట్టాభి, నల్లా దుర్గారావు, నడింపల్లి సుబ్బరాజు, మాదవరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం టెండర్లలో అక్రమాలు

యానాం: రేషన్ బియ్యం టెండర్లలో అక్రమాలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం సుమారు రూ.20 కోట్ల మేర ప్రజాధనాన్ని కోల్పోయిందని పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రతిపక్షనేత ఆర్.శివ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో పేదలకు ఉచిత బియ్యం పంపిణీలో పలు అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆ విధంగా టెండర్ల ప్రక్రియలో ఒక నార్తరన్ కంపెనీకి అనుకూలంగా ఈ వ్యవహారం నడుస్తుందని విమర్శించారు. దీంతో పేద రైతాంగం, స్థానిక రైస్‌మిల్లుల యాజమాన్యాలపై ప్రభావం పడుతుందన్నారు. బియ్యం పంపిణీకి సంబంధించి కేవలం ఒకే ఒక్క వేదాంత కంపెనీకి అనుకూలంగా టెండర్ జరుగుతుందని మిగతా పుదుచ్చేరిలోని ఏ ఒక్క కంపెనీ పాల్గొనడం లేదన్నారు. ఒక కిలో బియ్యం ఖరీదు రూ.47.70 పైసలుగా నిర్ణంచారన్నారు. ప్రస్తుతం మరో నాలుగు నెలల పాటు బియ్యం సరఫరా చేసే టెండర్‌ను పొడిగించారని, మళ్లీ అదే ఉత్తరాది కంపెనీకి అప్పగించారన్నారు.

పనులు కొనసాగుతూ!



ఎంట్రుకోన ప్రధాన కాలువపై బేస్‌మెంట్ స్థాయిలో వంతెన నిర్మాణ పనులు

నీటి విడుదలకు అవాంతరాలు

అల్లవరం: ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాల నుంచి పంట నష్టపోకుండా ముందస్తుగా సాగుకు వెళ్లాలనుకున్న రైతులకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రతి ఏడాది జూన్ మొదటి వారంలో కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో జూన్ చివరికి నారుమళ్లు సిద్ధం చేసుకుని వరినాట్లు వేసేవారు. అయితే ఈ ఏడాదిలో ఖరీఫ్ సాగుకు మరింత ఆలస్యం అయ్యేలా ఉంది. ప్రధాన కాలువలకు సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని స్థితిలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారు. దీనికి కారణం ప్రధాన కాలువలపై వంతెనల నిర్మాణం చేపట్టడమే. అమలాపురం రూరల్ పరిధిలో నడిపూడి లాకు వద్ద ఒక వంతెన, ఇందపల్లి వద్ద రెండో వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ రెండు వంతెనలు ప్రస్తుతం ఫిల్లర్ల స్థాయిని దాటుకుని శ్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో వారం నుంచి పది రోజుల వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అల్లవరం మండలంలో ఎంట్రుకోన ఎంపీపీ స్కూల్ వద్ద వంతెన నిర్మాణం రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం బేస్‌మెంట్ స్థాయిలో ఉంది. కాలువలు మూసివేసిన నెల రోజుల తర్వాత వంతెన నిర్మాణ పనులు చేపట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బేస్‌మెంట్ స్థాయిని దాటుకుని ఫిల్లర్లు ఆపై శ్లాబ్ పూర్తి చేయడానికి కనీసం రెండు వారాలైనా పడుతుంది. అప్పటి వరకు కాలువలకు సాగునీరు విడుదలకు బ్రేకులు పడినట్లే. దీంతో కాలువలపై వంతెన నిర్మాణాలతో ఖరీఫ్‌కు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. మూడు వంతెన నిర్మాణాలతో అల్లవరం మండలంలో వందలాది ఎకరాలపై తీవ్ర ప్రభావం పడనుంది. రూరల్ పరిధిలోని పేరూరు, ఇందుపల్లి గ్రామాల్లో సాగుకు ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. కాలువలపై వంతెన నిర్మాణాలతో ప్రతి ఏడాది ఇదే తంతు జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు ఖరీఫ్ వెళ్లాలనుకున్న రైతులకు వంతెన నిర్మాణాలతో సాగునీటిని ఆలస్యంగా విడుదల చేసి సాగుకు అవాంతరాలు సృష్టిస్తున్నారని వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణని 'సాక్షి' వివరణ కోరగా అమలాపురం నియోజకవర్గ పరిధిలో 16 వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎంట్రుకోన వద్ద వంతెన నిర్మాణంపై కనీసం ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే ప్రారంభించారు. దీని వల్ల అల్లవరం కాలువకు సాగునీరు ఆలస్యం అవుతుందని తెలిపారు.

పత్రం.. పుష్పం.. ఫలం..



'పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి' అని శ్రీకృష్ణ పరమ్మాత భగవద్గీతలో స్వయంగా చెప్పాడు. అంటే పత్రం, పుష్పం, ఫలం, నీటిలో ఏది భక్తితో ఇచ్చినా భగవంతుడు ప్రేమ తో స్వీకరిస్తాడని అర్థం. దీనికి తగినట్టుగానే.. అమలాపురం శ్రీ వేంకటేశ్వరుని దేవస్థానంలో స్వామివారిని పండ్లు, పూలతో ప్రత్యేకంగా అలకరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన శనివారం కావడంతో పట్టణానికి చెందిన భక్తులు కంచర్ల వెంకట రామ సుబ్రహ్మణ్యం, లక్ష్మీరాధ దంపతులు ప్రత్యేక అలంకరణ చేయించారు. అలంకరణ అనంతరం స్వామివారికి ప్రధానార్చకుడు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు తెల్లవారుజామున తొలి హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ యర్రా వెంకటేశ్వరరావు, సిబ్బంది అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

– అమలాపురం టౌన్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



తాళ్లరేవు ఆస్పత్రి వద్ద పసికందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చెక్కా మాధురికి పురిటి నొప్పులు రావడంతో తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో చేర్చారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసిబిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న చెక్కా రాము, మాధురి దంపతులను జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నాయకులు కొపనాతి నాగరాజు, వెంటపల్లి నూకరాజు, పోతుల రత్నకుమారి, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పరామర్శించారు. పసికందు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

నేడు కామేశ మహర్షి సంస్మరణ సభ

అమలాపురం టౌన్: ఈ నెల 5న శివైక్యం పొందిన అమలాపురం శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి సంస్మరణ సభ పీఠంలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు తెలిపారు. శ్రీకామాక్షీదేవి మేనేజింగ్ ట్రస్టీ వక్కలంక వాణి అధ్యక్షతన జరిగే ఈ సభలో ట్రస్ట్ సభ్యుడు, న్యాయ సలహాదారు వీరా నాగేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడతారని అన్నారు. పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ సభలో కామేశ మహర్షి అధ్యాత్మిక ప్రస్థానాన్ని వివరిస్తారన్నారు. ఈ సభకు భక్తులు, అభిమానులు, ఆధ్యాత్మిక వాదులు తరలిరావాలని పీఠం మేనేజర్ దుర్గారావు విజ్ఞప్తి చేశారు.

పిచ్చికుక్క దాడి

అమలాపురం రూరల్: సమనసలో శనివారం ఓ పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో కొంతమంది యువకులు ఆ కుక్కను హతమార్చారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రుణాల ప్రతిపాదనలకు త్వరలో ఆమోదం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా తాగునీరు, మురుగునీటి నిర్వహణ పనులతో సహా అనేక మౌలిక సౌకర్యాల పనులకు వివిధ సంస్థల నుంచి రుణాల పొందేందుకు ప్రతిపాదించిన వాటికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం పొందే దశలో ఉందని ఎల్జీ కె.కైలాసనాథన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.8 వేల కోట్ల రుణాలను పొందాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇది ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం పొందే దశలో ఉందన్నారు.


పైపులైన్‌లోకి మురుగునీరు

యానాం: నియోజకవర్గ శివారు గిరియాంపేట, సావిత్రినగర్‌లో తాగునీటి పైపులైన్‌లో మురుగునీటి పైపు కలసిపోయి వస్తున్న నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్ అన్నారు. ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఆయన ఆధ్వర్యంలో పలువురు నాయకులు పరిస్థితిని పరిశీలించి సంబంధిత పీడబ్ల్యూడీ, హెచ్‌ఆర్‌స్క్వేర్ సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బలగం గణేష్, వైదాడి శ్రీను, మచ్చా రాజు, రామకృష్ణ, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

అమలాపురం రూరల్: అనాతవరం నాగసాయి ప్రైమరీ ఐకేర్ ఆప్టికల్స్ సౌజన్యంతో గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు ప్రారంభించారు. డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురిని కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి శ్రీరామ్మూర్తి, శ్రీకాకుళపు సురేష్, పెద్దిరెడ్డి చిన్న వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సురేష్, కేతా వెంకటరమణ పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే డీఐజీ



అంతర్వేది ఆలయంలో డీఐజీ వల్లేశ్వర బాపూజీకి చిత్రపటం ఇస్తున్న ఏసీ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ డీఐజీ వల్లేశ్వర బాపూజీ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామి చిత్రపటం అందజేశారు.